# మళ్ళీ నిమ్మపల్లి వెళ్ళాలి!

— 'వసుధ'

మనసులో వూహలు విమానాలెక్కి ఆకాశంలోకి దూసుకుపోతుంటే, నేను పాసింజర్ బస్సెక్కాను. 'నిమ్మపల్లి' చేరగానే రాజుగాడు నన్ను చూసి ఎలా ఆశ్చర్యపోతాడో, ఎంత ఆనందపడ్తాడో అని తీయని కలలు కంటున్న నేను బస్సు కుదుపుకు ఒక్కసారి ఎగిరి కిందపడబోయి, ఎలాగో ఆపుకున్నాను. ఊహల ఉయ్యాల్లో ఊగుతూ, మధ్య మధ్య బస్సు కుదుపుకు ఉలిక్కిపడ్తూ ప్రయాణం చేస్తున్నాను. యింతలో నా ముందు సీట్లో కూర్చున్న అమ్మాయి సడెన్‌గా లేచి, వెనక్కి తిరిగి కొరకొరా చూస్తూ—

"ఇందాకట్నుంచి చూస్తున్నాను, ఏమిటలా కాలు తొక్కుతావు? సభ్యత తెల్సిన వాడివేనా?" గయ్యిన అరిచింది. నాకు 'తా' రెత్తింది.

'నన్నేనా?' అన్నట్లు పరిశీలనగా చూశాను.

"సారీ! ఎవర్ని మీరనేది?" సీరియస్‌గా అడిగాను.

"మిమ్మల్నే! యిందాకట్నుంచీ చూస్తున్నాను. 'పొరపాటేమోలే' అని వూర్కుంటే మరీ ఎక్కువయింది. అయినా చదువుకున్న వారిలా వున్నారు, ఆడవాళ్ళంటే అలా చులకన భావమా? పిచ్చి చేష్టలు చేస్తే వూర్కోడానికి నేనేం అందరిలాంటి ఆడపిల్లను కాను" ఉరిమింది మళ్ళీ.

"సారీ మేడమ్, నేనలాంటి వాడిని కాను" బస్‌లో అందరూ నన్నే చూస్తున్నారన్న సిగ్గుతో, అనవసరంగా నా మీద నిందవేసిన ఆ అమ్మాయి మీద కోపంతో ఉడికిపోయాను.

"చేసింది చేసి నాకేం తెలియదంటే సరిపోతుందనుకున్నారా? యింకోసారి నా జోలికి వస్తే ఊర్కొనేది లేదు" గట్టిగా అరిచి, తన సీట్లో కూలబడింది.

నాకంతా అయోమయంగా వుంది. నా పక్క కూర్చున్న ముసలాయన 'ఫక్కు'న నవ్వాడు. ఆ అమ్మాయి పక్కన పదేళ్ళపిల్ల కూర్చుని వుంది.

'నేను కాకపోతే యింకెవరు తొక్కుతారు ఆ అమ్మాయి కాలు?' అనుమానంగా నా పక్కన కూర్చున్న ముసలాయన్ని చూశాను. వెకిలిగా నవ్వాడు ముసలాయన.

"అబ్బో, 'రసికుడు'లాగే వున్నాడు. వీడి పక్కన ఎందుకు కూర్చున్నానురా దేవుడా?" నీరసంగా అనుకొని, సీట్లో ముడుచుకుని కూర్చున్నాను.

నిమ్మపల్లి యింకో రెండు మైళ్ళుందనగానే బస్సు ఆపేశాడు డ్రైవరు.

"ఏమిటయ్యా, నిమ్మపల్లి తీసుకెళ్తానని యిక్కడ ఆపావు?" విసుక్కుంటూ అడిగాను.

"యిదేనండీ స్టాపు. ఇక్కడ్నుంచి అట్టా వాగుదాటితే అగుపడేదే నిమ్మపల్లి. బండి వాగు దాటెల్లదు. అంతా ఈడనే దిగిపోవాల" నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు డ్రైవరు. పాసింజర్లు పదిమందిదాకా దిగారక్కడ. అంతా ఎవరిదారిన వారు పోతున్నారు. నాకు నిమ్మపల్లి కొత్త. 'ఎటు వెళ్ళాలి? ఎవర్ని అడగాలి?' నేను సందిగ్ధంలో పడి కొట్టుకుంటుండగానే, ఒక్కొక్కరే చేలల్లో అడ్డంపడి, వెళ్ళిపోతున్నారు. మమ్మల్ని దింపేసిన బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయి, పదేళ్ళ పిల్ల మాత్రం నిలబడ్డారు చెట్టు కింద. ఆ అమ్మాయి ఎవర్నో తిడ్తోంది, మొహమంతా చిట్లించి.

'ఈ అమ్మాయికి ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని తిట్టడమే పనిలాగుంది' అనుకున్నాను. దారి అడగటానికి వాళ్ళు తప్ప యింకెవరూ మిగల్లేదు. ఆ అమ్మాయి మొహం చూడటానికే భయంగా వుంది నాకు. మెల్లిగా గొంతు సవరించుకొని, "పాపా, నిమ్మపల్లికి ఎటు వెళ్ళాలి?" అడిగాను. ఆ పిల్ల వేలుపెట్టి చూపిస్తూ "అటు" అంది. "పాపా! రాజేశ్వరరావుగారి యిల్లు తెల్సా నీకు?" అడిగాను.

"ఏ రాజేశ్వరరావు?" అంది—ఆ పిల్ల—కాదు, ఆ అమ్మాయి.

'ఏట్లో రాజేశ్వరరావు' అందామనుకున్నా. అవసరం నాది కనుక, "పామర్ల రాజేశ్వరరావు" అన్నాను.

ఆ అమ్మాయి మొహం ప్రసన్నంగా మారిపోయింది. నన్ను పరీక్షగా చూస్తూ, "మీరు చలంగారా?" అంది.

'బాబోయ్, ఈ పిల్లకేదో దివ్యశక్తులున్నట్లున్నాయ్. నేనీపిల్లను ఎప్పుడూ చూడలేదే' అనుకుంటూ ఆ అమ్మాయిని చూస్తూ, తల వూపాను 'అవున'న్నట్లు.

"యివాళ మీరు వస్తున్నట్లు ఆయనకు తెలియదేమో! లేకపోతే బండిలో వచ్చేవారే," అంది.

"నేనే ఒక్కసారి ఆశ్చర్యపరుద్దామని తెలియపర్చకుండా వచ్చాను," అన్నాను.

"మా బండి కూడా రాలేదు. సరే నడుద్దాం పదండి. మా యిల్లు కూడా అటే," అంటూ ముందుకు నడిచింది ఆ అమ్మాయి. పల్లెల్లో కూడా యిలాంటి ఆడపిల్లలు వుంటారని నాకు తెలియదు.

"యిందాక మీరెవరో అనుకొని అనవసరంగా తిట్టాను. క్షమించండి" అంది తనే మళ్ళీ.

నాకేమనాలో తోచలేదు. 'యిందాక టపాకాయలా ఎగిరిన పిల్ల యింత మెల్లగా ఎట్లా మాట్లాడు గలుగుతోందా?' అని ఆలోచిస్తున్నాను.

పల్లెల్లో పడతులు పరాయి మగవాడిని చూస్తేనే పారిపోతారని, అమాయకంగా వుంటారని నా ఊహ. 'యింత ధైర్యంగా మాట్లాడుగల్గుతోందంటే ఈ అమ్మాయి పల్లెటూరి పిల్ల మాత్రం కాదు. చదువుకున్న దానిలాగే వుంది' అనుకున్నాను మళ్ళా.

"యింకా కోపమేనా? సారీ అన్నాగా" కాస్త చిరాకు, కాస్త నవ్వు మిళాయిస్తూ అంది.

"అబ్బే, కోపం ఏమీ లేదండీ" ఏదో ఒకటి అనాలి కనుక, అన్నాను.

"ఇంతకీ రాజేశ్వరరావు మీకు బాగా తెల్సా?" అడిగాను నడుస్తూనే.

ఆ అమ్మాయి నవ్వింది చిన్నగా. "'బాగా' ఏమోకానీ, తెల్సు. ఆయన ఎప్పుడూ మీ గురించే చెప్తుంటారు. 'నాకున్న ఒకే ఒక ఫ్రెండు' అంటూ వుంటారు. మీ ఫొటో కూడా ఎప్పుడో చూశాను ఆయన దగ్గర." అంది ఆ యువతి.

"మీరు రాజు వాళ్ళ చుట్టాలా?" అడిగాను అనుమానంగా.

"నన్ను పరిచయం చేసుకోలేదు కదూ? నా పేరు కళ. టీచర్‌గా వుంటున్నాను నిమ్మపల్లి లోనే. నాకు పల్లె వాతావరణం అంటే చాలా యిష్టం. అందుకే యిక్కడ చేరాను. రాజేశ్వర రావుగారి పొలాలు చూడటానికి రోజూ వెళ్ళటం నా అలవాటు. అలా అయింది మా పరిచయం." అంది తనను పరిచయం చేసుకుంటూ.

"ఐసీ!" అన్నాను గట్టు మీద జాగ్రత్తగా నడుస్తూ. మరో అరగంటలో రాజు యింటికి చేరాం. కళ బయటనుంచే, "ఏమండోయ్, రాజుగారూ!" అంటూ కేకేసింది.

"ఎవరూ? కళా?" అంటూ బయటకు వచ్చిన రాజు, నన్ను చూస్తూనే ఆశ్చర్యంతో నోరు తెరిచేసాడు.

"ఒరే, అమాంతం ఎక్కడ్నుంచి ఊడిపడ్డావు రోయ్" అంటూ నన్ను కౌగలించుకొని, "అవునూ, కళా, నువ్వూ ఎలా కలిసారు? అసలు ఉత్తరం ముక్క కూడా రాయకుండా ఊడి పడ్డా వేంరా? యింత మంచి బుద్ధి పుట్టిందేం నీకు?" ప్రశ్నమీద ప్రశ్న కురిపిస్తున్నాడు రాజు. కళ మమ్మల్ని చూసి, నవ్వుతూ "బాబూ, మీ పార వశ్యంలో నన్ను మర్చిపోయారు. నేను వెళ్తున్నాను మరి. ఏమండీ చలంగారూ! మీ ఫ్రెండుని చూపించాగా. నా మీద కోపం పోయినట్లేనా?" నావైపు ఒకసారి చూసి, సమాధానం కోసం ఎదురు చూడకుండానే వెళ్ళిపోయింది చకచకా నడుస్తూ.

"పదరా నాన్నా లోపలికి. కళా, నువ్వూ ఎలా కలిసారు? కోపం అంటుందేమిటి?" అడిగాడు రాజు లోపలికి నడుస్తూ. క్లుప్తంగా సంగతంతా వివరించాను. పకపకా నవ్వాడు రాజు.

"కళ ఎప్పుడూ అంతేరా! ముక్కుమీదే వుంటుంది కోపం" అన్నాడు.




'ఓహో, పరిచయం చాలా వుందన్నమాట' అనుకున్నాను. అప్పటికే సాయంత్రం నాల్గయింది. స్నానం చేసి, కాఫీ తాగి వూరుమీద పడ్డాం. నడిచి, నడిచి వూరిబయట రాజు వాళ్ళ కొబ్బరి తోటలో కూలబడ్డాం.

"అయితే రాజిగా! చదువైపోయింది. లైఫ్‌లో సెటిలయి పోయావు. యింకా ఎన్ని రోజులురా ఈ బ్రహ్మచారి బ్రతుకు?" అడిగాను.

"పల్లెటూరి రైతును, నాకెవరిస్తార్రా పిల్లను?" తమాషాగా నవ్వుతూ అన్నాడు.

"పోరా వెధవా. నీకేం-బి. యస్‌సి. పాస్ అయ్యావు. స్వంతంగా వ్యవసాయం చేస్తున్నావు. నీకు ఉన్న సుఖం నాలాంటి వాళ్ళకు రమ్మంటే వస్తుందా? గొర్రెతోక జీతాల్తో మా అవస్థలు మీకేం తెలుస్తాయి?" అన్నాను వాడి మాటలు కొట్టి పారేస్తూ.

"నా సంగతి సరేగానీ, నువ్వు లాస్ట్‌వీక్‌లో ఎవర్నో చూడ్డానికి వెళ్తున్నానని రాసావు? ఏమయింది?" అడిగాడు రాజు.

"ఆవిడగారు చాలా భక్తురాలట, మూడు కుంకుమ బొట్లు పెట్టుకొని వచ్చింది. అసలు మనిషిలో చలాకీ తనం అన్నమాట లేదు. తలెత్తితే ఒట్టు! అమ్మకు మహా నచ్చిందిలే. అదంతా 'అణుకువ'ట; 'వినయం'ట. ఒప్పుకో మని సతాయిస్తోంది. ఆ గొడవ పడలేక రెండ్రోజులు లీవుపారేసి వచ్చా."

నవ్వేసాడు రాజు. "నువ్వు పెట్టే వంకలకు, నీకు ఈ జన్మకు పెళ్ళికాదు చూస్కో" అన్నాడు నవ్వుతూనే.

## పుస్తకాలు

### ఉరిత్రాడు

(నవల)

[రచన : వాసిరెడ్డి సీతాదేవి; ప్రచురణ : ఎమ్. శేషాచలం అండ్ కో, సుంకురామసెట్టివీధి, మద్రాసు–1; పాకెట్ సైజులో పేజీలు : 127; వెల : రు. 3–50]

"ఏ బంధంలో పెద్దలందరూ మమ్మల్ని కలిసి బతకండి అని ఒక చోటుకు చేర్చారో ఆ బంధం ఆయనే తెంచేశాడు. కట్టినవాడికి లేని గౌరవం ఆ మాంగల్యం మీద నాకెందుకు వుండాలి?" బంగారం కోసం తన మెళ్ళో మంగళ సూత్రం తెంచుకున్న మొగుడి మీద పరమ అసహ్యంతో పుట్టింటికి వచ్చిన కరుణ వేసిన ప్రశ్న ఇది.

సనాతన సంప్రదాయానికి ప్రతీకగా కనిపించే తల్లి కనకమ్మ – కరుణతో ఘర్షణ పడుతుంది. అన్న విశ్వం, వదిన శారదలకు ఇష్టం లేక పోయినా, చెల్లెలు కస్తూరి, ఆమె భర్తా కలిసి కరుణను భర్త దగ్గరికి మళ్ళీ చేరుస్తారు. అయితే ఈసారి అతను డబ్బు కోసం కరుణను ఎవరి దగ్గరకో పంపడానికి సిద్ధపడే సరికి, ఆమె తాళి తెంపి అతని ముఖాన కొట్టి పుట్టింటికి వస్తుంది!

"మీరంతా మంగళప్రదంగా పూజించే మాంగల్యం నా కంఠానికి ఉరిత్రాడైంది. ప్రతి నిమిషం నాకు నరకాన్నే చూపించింది. దాన్ని తెంచి పారేశాను. నరకయాతన నుంచి విముక్తు రాల్నయ్యాను. నేను చేసింది తప్పా?" అని అడుగుతుంది కరుణ. తప్పు కాదన్న శ్రద్ధ సానుభూతితో ఆహ్వానించినా తల్లి కళ్ళల్లోని భయాన్ని గుర్తించి "నా పసుపు కుంకుమ నా తాళి కట్టిన వాణ్ణి పోషించటం కంటె నన్ను నేను పోషించుకోవటం నీచమా? ఈ జన్మలో నా ముఖం మళ్ళీ మీకెవరికీ చూపించను" అని వెళ్ళిపోతుంది కరుణ.

మాంగల్యానికి అర్థం తెలియని వాడు, భార్యని గౌరవించలేనివాడు, హింసతో ఆనందం అనుభవించే 'సేడిస్ట్' అయిన భర్తతో జీవితం ఎంత నరకమో కళ్ళకు కట్టినట్లుగా రచించారు రచయిత్రి.

మన తరతరాల సంస్కృతిని ప్రతిఫలింపచేసే వైవాహిక సంబంధాలు ఆదర్శవంతంగా వుండాలంటే–మగవారి మనస్తత్వంలో మార్పు తెచ్చే ఇలాంటి ప్రయోజనాత్మకమైన నవలల అవసరం ఎంతైనా వుందనిపిస్తుంది–నవల పూర్తి చేసిన తర్వాత.

---

"కాకపోతే, పీడా పోయిందిగానీ, నీ సంగతి ఏడువు ముందు" అన్నాను.

"చెప్పడానికి ఏముందిరా? అమ్మ పోయిన దగ్గర్నుంచీ వంటరి వాడ్నయి పోయాను. ఇంట్లోనూ, బయటా పనులు చూసుకోడం కష్టంగానే వుంది" అన్నాడు రాజు.

"అయితే నేను చెప్పినట్లు చెయ్" అన్నాను.

"చెప్పుమరి" అడిగాడు రాజు, వినయంగా.

"మా కజిన్ ఒక అమ్మాయి వుంది. అమ్మాయి బాగుంటుంది. పెద్దగా చదువుకో లేదనుకో. నువ్వు నచ్చే గుణాలన్నీ వున్నాయి. నువ్వు 'ఊఁ' అంటే నిముషంలో పెళ్ళి జరిపిస్తా" అన్నా అసలు సంగతి బయటపెట్టూ.

"పెళ్ళిళ్ళు పేరయ్యావి ఎప్పుడయ్యావురా? అయినా నాకు నువ్వేం చూడొద్దులే" అన్నాడు రాజు.

"అంటే? నువ్వే చూసుకుంటావా?" అన్నాను కోపంగా.

"చూసేసుకున్నారా! అయితే యింకా వాళ్ళ అభిప్రాయం తెల్సుకోలేదు" అన్నాడు.

"ఎవర్రా ఆ అమ్మాయి?" కుతూహలంగా అడిగాను.

"తర్వాత చెప్తాలే, యికలే పోదాం, చీకటి పడుతోంది" అంటూ లేచాడు.

ఆ రాత్రికి ఆరుబయట వెన్నెల్లో మంచాలేసుకొని, చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ ఏ రాత్రో నిద్రపోయాం.

పొద్దున్నే లేచి స్నానం ముగించి, రాజుతో పాటే పొలానికి బయల్దేరాను. కాసేపు అదీ, యిదీ చూసాక విసుగుపుట్టింది నాకు. రాజు కూలీలతో ఏదో మాట్లాడుతున్నాడు. 'అలా వూర్లో తిరిగి వస్తారా!" అని బయల్దేరాను.

"తొందరగా వచ్చేయరా!" వెనకనుంచి అరిచాడు రాజు. 'అలాగే'నంటూ తలవూపి, వూర్లోకి నడిచాను. అటూయిటూ చూస్తూ పోతున్న నాకు, కళ పిలుపు విన్పించింది. 'ఏమండీ, చలంగారూ!" అంటూ.

'గుడ్ మార్నింగ్' అంటూ తలుపు తోసుకొని లోపలికి అడుగుపెట్టాను. చిన్న పెంకుటిల్లు, ముందు అందమైన తోట.

"యిదేనండీ మా స్కూలు. ఈ గార్డెనంతా మా పిల్లలు పెంచిందే!" అంటూ లోపలికి తీసుకెళ్ళింది. లోపల మూడు నాల్గు గదులున్నాయి. వరసగా అన్నిట్లో బెంచీలు వేసి వున్నాయి. అన్నిటికీ వెనగ్గా కొంచెం చిన్నదిగా వున్న గదిలో మూడు కుర్చీలు, టేబుల్ మాత్రం వున్నాయి. ఆ గదిలోకి అడుగుపెట్టి, "యిదే మా ఆఫీసు రూమ్" అంది కళ కుర్చీ చూపిస్తూ.

"అయితే 'టీచరమ్మ'గారు ఒక్కరేనా బడికి?" అన్నాను కూర్చుంటూ.

"ప్రస్తుతానికి యిద్దరం వున్నాం. మాస్టారు ఈ రోజు లీవ్ పెట్టారు ఏదో తరగతిదాకానే వుంది ప్రస్తుతానికి. వచ్చే ఏడాది మరో నల్గుర్ని వేసి, టెన్త్‌దాకా పెట్టాలని ప్రపోజల్ వుంది" అంది కళ.

"ఈ ఊర్లో బోర్ కొట్టదా మీకు?" అడిగాను నేను.

"బోరా? ఎందుకండీ? అసలీవూర్లో ఒక్క రోజు లేకపోతే ఎలాగో వుంటుంది నాకు. పగలంతా పిల్లలతో గడిచిపోతుంది. సాయంత్రాలు అలా పొలాల్లోకి వెళ్తే ఎంత ప్రశాంతంగా, హాయిగా వుంటుందనుకున్నారు? అసలీ పల్లెలో వున్న అందం, ప్రశాంతత మరెక్కడా లేవేమో ననిపిస్తుంది నాకు." అంది కళ. ఆశ్చర్య పోయాను నేను. చదువుకున్న ఆడపిల్లలు యిలా మాట్లాడతారని నేను అనుకోలేదు. 'పల్లెల్లో పది రోజులకన్నా వుండాలంటే బోర్' అనేవాళ్ళని కోకొల్లలుగా చూశాను గానీ, యిలాంటివారిని చూడలేదు.

కాసేపు అదీ, యిదీ మాట్లాడి బయటకు వచ్చేసాను. ఆ కాసేపట్లో కళకు పిల్లలంటే చాలా యిష్టం అనీ, పైకి కోపంగా కన్పించినా మనసు మంచిదనీ అన్పించింది నాకు. 'ముక్కు మీద

కోపం కూడా అందంగానే వుంటుంది కళకు' అనుకున్నాను మనసులోనే. నిమ్మపల్లిలో వున్న రెండ్రోజుల్లో తోటలోనూ, రాజు యింట్లోనూ మరి రెండుసార్లు కలిశాను కళను. కళ అంటే ప్రత్యేక మయిన అభిమానం ఏర్పడింది నాకు. దాన్ని శాశ్వతంగా నిలుపుకోవాలనుకున్నాను. తిరిగి వూరు వచ్చేసే రోజు కళా, రాజూ యిద్దరూ బస్‌స్టాండ్‌కు వచ్చి, వీడ్కోలిచ్చారు నాకు. తీయని వూహలతో యిల్లు చేరాను నేను. మర్నాడు లెటర్రాద్దామంటే వీలు కాలేదు. రెండో రోజు వీలు చేసుకొని 'కళను వివాహం చేసుకోవాలనుకుంటున్నాననీ, నీ అభిప్రాయం తెల్పమనీ' రాజుకు లెటర్ రాసి, పోస్ట్‌బాక్స్‌లో పడేసి, ఆఫీసు చేరాను. నా టేబుల్ మీద లెటర్ చూసి, అరే 'రాజు ఉత్తరం రాసాడే?' అనుకుంటూ కవరు చింపాను ఆత్రుతగా.

"డియర్ చలం!

నువ్వు యిక్కడికి వచ్చి వెళ్ళాక మనసుకు శాంతిగా వుంది. ఎవ్వరూ లేరనుకొనే నాకు, నీ రాక ఎంత మనశ్శాంతినీ, తృప్తినీ కలుగజేసిందో చెప్పలేను!

పోతే, నువ్వు వచ్చినప్పుడు నా పెళ్ళి గురించి అడిగావు. అప్పుడు ఏమీ చెప్పలేకపోయాను. 'కళ'ను చూశావుగదా? కళను గురించి నీ అభిప్రాయం ఏమిటి? పైకి కోపంగా కన్పించినా, మనసు చాలా మెత్తన. సంవత్సరం నుంచీ కళ, నేనూ మంచి స్నేహితులమయాం. అమ్మ పోయాక కళలో సన్నిహితత్వం, ఆత్మీయత మరీ పెరిగాయి. అందుకే ఆ బంధాన్ని శాశ్వతం చేసుకోవాలనుకుంటున్నాను. నువ్వు వచ్చే రోజు వరకూ కళ అభిప్రాయం అడగలేదు. నిన్న సాయంత్రం నిన్ను బస్‌లో ఎక్కించి వస్తుంటే, కళను అడిగాను. సిగ్గుతో తలవాల్చిన కళ కళ్ళు చూసే సమాధానం తెల్సుకున్నాను. అందువల్ల— నీ కోర్కె తీరబోతూంది త్వరలో! మరి, నీ పెళ్ళి కూడా త్వరగా నిశ్చయించు. వుంటాను.

నీ

'రాజు'

ఉత్తరం చదివాక కంగారు పుట్టింది. వెంటనే నేను మళ్ళీ 'నిమ్మపల్లి' బయల్దేరాను. ఎందుకో తెల్సుగా! (తెలియనివారికి: రాజుకు నేను రాసిన వుత్తరం అతనికి చేరకముందే, దాన్ని నేను చేజిక్కించుకుందుకు!)

❋



## చంటిపిల్లలు ఎందుకేడుస్తారు?

పాలు త్రాగే పసిపాపల ఏడుపు తల్లులకు అప్పుడప్పుడు ఓ సమస్యలా తయారవుతుంది. చంటి పాపకు మాట్లాడటం రాదు. అందుకే ఎందుకేడుస్తుందో చెప్పుకోలేదు. ఎలాంటి అవసరం వచ్చినా ఏడుస్తుంది. అనుభవంలేని తల్లి-పాప ఎందుకేడుస్తుందో తెలుసుకోలేక కంగారు పడ్తుంది. పాపను ఎంత సముదాయించాలని చూస్తే పాప అంత ఎక్కువగా ఏడుస్తుంది. పాపకు ఆకలవుతోందేమోనని పాలివ్వడానికి ప్రయత్నిస్తే ఒక్కొక్కప్పుడు పాప పాలుత్రాగదు. ఆ ఏడుపు కడుపు నొప్పివల్ల కావచ్చు; ఇంకెందువల్లనైనా కావచ్చు. కారణం ఏదైనా తెలిస్తే కదా నివారించడానికి? అలాంటి సమయాల్లో తల్లి ఏం చెయ్యాలి?

పాప ఏడుస్తున్నప్పుడు తల్లి మానసికంగా అలమటిస్తుంది. ఆమెకు రకరకాల అనుమానాలు వస్తాయి—పాప పిన్నీసు మింగిందా? లేక దానికి ఏదయినా కుట్టిందా? ఇలా ఆమెకు పెద్ద పెద్ద అనుమానాలు వస్తుంటాయి. చిన్న విషయాలను గురించి ఆమె ఆలోచించదు. పాపకు చలి వేస్తుండవచ్చు. ఉక్కగా వుండవచ్చు.

అనుభవం లేని తల్లులు పిల్లలు ఏడవగానే కంగారు పడ్తారు. ఆ కంగారులో వారి ప్రవర్తనలో సహజంగా మార్పు కలుగుతుంది. ఈ మార్పు ప్రభావం ఏడుస్తున్న పాపపై పడ్తుంది. పాప ఏడుపు ఎక్కువ చేస్తుంది. తల్లి ఇంకా ఎక్కువగా కంగారు పడ్తుంది. ఇది ఒక విషవలయం లాంటిది. ఇలాంటి సమయాల్లో తల్లిలో కంగారు, ఆత్రుతలవల్ల వచ్చిన మార్పుపోతేగాని పాప ఏడుపు మానదు.

తల్లిపాలు త్రాగే పిల్లలు ఎంత పాలు తాగింది తల్లికి అంచనా తెలీదు. కొంతమంది పిల్లలు పాలు తాగుతూ నిద్రపోతారు. మరికొంతమంది పిల్లలు పాలు పీల్చుకోలేక ఏడుస్తారు. అలాంటప్పుడు పిల్లలకు సీసాతో పాలివ్వడం మంచిది. పిల్లలు ఎంత పాలు త్రాగిందీ తెలుస్తుంది. సీసాతో పాలు త్రాగే పిల్లల విషయంలో మన తల్లులు మరో పొరపాటు కూడ చేస్తుంటారు. పాలు చిక్కగా వుంటే పాప కడుపు పాడవుతుందని పాలలో బాగా నీళ్ళు కలిపి పల్చగా చేస్తారు. ఒక ఔన్సు పాలతో మరొక ఔన్సు నీళ్ళు కలిపి పిల్లలకు పట్టిస్తే ఆ ఆహారం ఒక ఔన్సు పాలేగాని అది రెండు ఔన్సులు మాత్రం కాదు. అందుకే ఇలాంటి పాలు తాగిన పిల్లలు, పాలు పట్టించే సమయానికి ముందే ఏడుస్తారు. డాక్టరు చెబితేతప్ప పాలలో ఎక్కువగా నీళ్ళు కలపకూడదు. పౌడరు పాలు వాడేవారు గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే పాల పౌడరు డబ్బాపై రాసి వున్న మోతాదుకంటే పిల్లలకు ఎప్పుడూ పాలు కాస్త ఎక్కువగానే ఇవ్వవలసి వుంటుంది.

పసి పాపలు, తమకు కావలసింది మాటల్లో చెప్పుకోలేరు కాబట్టి తమకు ఏది అవసరమైనా ఏడుపు రూపంలో తెలియబరుస్తారు. ఆకలయినప్పుడు కాని పాలు ఎక్కువగా తాగినప్పుడు కాని, కడుపునొప్పితో గాని పాప ఏడుస్తుంది. దీనికి డాక్టరు వద్దకు పోవలసిన పనిలేదు. కొంచెం గ్లూకోసు నీళ్ళు లేక తేనే లేక గ్రైప్‌వాటర్ ఇస్తే సరిపోతుంది. అప్పటికీ ఏడుస్తుంటే ఉయ్యాలలోవేసి వూగించడంవల్ల కాని లేక మరో విధంగా కాని పాప ధ్యానం మళ్ళిస్తే సరిపోతుంది. నిద్రవచ్చితే తిరిగి మెలకువ వచ్చినప్పుడు ఆడుకోవడం మొదలెడ్తుంది.

కొన్ని సమయాల్లో పిల్లల నాసికారంధ్రం మూసుకుంటుంది. అంచేత పాలు తాగుతున్నప్పుడు ఊపిరాడక ఏడుస్తారు. పాలుతాగుతూ నోటితోనే శ్వాసను పీల్చడానికి ప్రయత్నించి వాంతులు కూడ చేసుకుంటారు. ఇలాంటి సమయాల్లో మూయబడిన నాసికా రంధ్రం తెరవడానికి ప్రయత్నించాలి. కాగిన నీళ్ళు చల్లార్చి కొంచెం ఉప్పు కలిపి ఒక చుక్క ముక్కు రంధ్రంలోవేసి దూదితోగాని మెత్తటి గుడ్డతోగాని ముక్కును శుభ్రపరిస్తే సరిపోతుంది.

అలసటవల్ల కూడ పిల్లలు ఏడుస్తారు. పిల్లల ఏడుపుకు మరోకారణం ఒంటరితనం కూడా కావచ్చు. చీకటిలో కూడా పిల్లలు ఏడుస్తారు. ఇంట్లో ఎవరూలేని సమయాన పిల్లలు భయపడి ఏడుపు మొదలెడ్తారు. ఏడుస్తున్నప్పుడల్లా పాలు పట్టించే సముదాయించవలసిన అవసరం లేదు. కాస్త ఏడవనిస్తే ఒంటికి మంచిది. ఏడుపువల్ల ఊపిరితిత్తులు బలపడతాయి. 'బాలానామ్ రోదనమ్ బలమ్' అన్నారు పెద్దలు.

—సగ్మాన